క్లుప్తంగా

ఓటు హక్కును వినియోగించుకోవాలి



ధన్వాడ: ఓటు హక్కు కోసం 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సింధూజా సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఓటు హక్కుతో తమకు నచ్చిన వ్యక్తిని ప్రజాప్రతినిధిగా ఎంపిక చేసుకోవచ్చని అన్నారు. ప్రిన్సిపల్ అబ్దుల్‌ముజీబ్, ఆర్ఐ మల్లేష్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం చేయండి

మరికల్: రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తులకు అమలు చేసిన రూ.లక్ష ఆర్థిక సాయాన్ని ఎలక్ట్రీషన్ కార్మికులకు కూడా అమలు చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు మకం శ్రీనివాస్, చంద్రారెడ్డి కోరారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. కార్మికుల్లో కూడా పేద వారు ఉన్నారని, ఆర్థికంగా లేకపోవడంతో చేతిలో పరికరాలు లేక కాంట్రాక్టర్ల కింద పనులు చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం ఎలక్ట్రీషన్ కార్మికులకు కూడా రూ.లక్ష ఆర్థిక సాయం అందజేయాలని కోరారు. సమావేశంలో మల్లేష్, కృష్ణాచారి, రవి పాల్గొన్నారు.

వీరభద్రుడి ఆలయంలో ప్రత్యేక పూజలు



కోస్గి: మండల పరిధిలోని అమ్లికుంట్లలో దశాబ్దాల చరిత్ర కలిగిన పురాతన వీరభద్రేశ్వరుడి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ సోమవారం పురస్కరించుకుని పలు గ్రామాలకు చెందిన భక్తులు ప్రత్యేక పూజలకు హాజరుకాగా.. ఆలయ పూజారి వినయ్ కుమార్ ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకం, అలంకరణ, మహామంగళ హారతితో పాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

ప్రభాకరవర్ధన్ మృతికి సంతాపం



ప్రభాకర వర్ధన్(ఫైల్)

నారాయణపేట రూరల్: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్, కురమ మాదాసి సంఘం జిల్లా అధ్యక్షుడు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు న్యాయవాది ప్రభాకరవర్ధన్ అకాల మృతికి పలువురు సంతాపం తెలియజేశారు. వారం రోజులుగా జాండీస్‌తో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి అందరితో కలిసిమెలిసి ఉండే ప్రభాకర్‌వర్ధన్ ఇక లేరనే విషయం పట్టణ ప్రజలు జీర్ణించుకోవడంలేదు. ఆయన మృతికి పార్టీలకు అతీతంగా సంతాపం ప్రకటించారు.

బీజేపీ ఒక సైనికుడిని కోల్పోయింది..

బీజేపీ ఒక సైనికుడిని కోల్పోయిందని, ఆయన మరణం పార్టీకి తీరనిలోటని రాష్ట్ర నాయకులు నాగురావునామాజీ, రతంగపాండురెడ్డి, జిల్లా అధ్యక్షుడు పీ.శ్రీనివాసులు అన్నారు. చిన్నతనం నుంచి సంఘ్ పరివార్‌లో చురుకుగా పనిచేస్తూ.. ఏబీవీపీ, బీజేవైఎంలో తన కంటు ఒక స్థానాన్ని ఏర్పరుచుకుని చివరి వరకు బీజేపీలోనే కొనసాగి గొప్ప విలువలను సమాజానికి అందించిన మహోత్తమ నాయకుడని కొనియాడారు. ఆయన ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి



నారాయణపేట: చాలీచాలని వేతనాలతో ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్నామని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని సోమవారం కలెక్టర్ కోయ శ్రీహర్షకు 104 ఉద్యోగులు వినతి అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) నాయకులు ఎదిరింటి శ్రీనివాస్ మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం 2022లో 104 వాహనాలను పూర్తిగా నిలిపివేసిన తర్వాత పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ప్రభుత్వ జిల్లా ఆస్పత్రులకు కేటాయించడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్నామన్నారు. డీఎస్సీ ద్వారా రోస్టర్ పాయింట్లతో 2008లో నియమించారని, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. కలెక్టర్‌ను కలిసి వినతి అందజేసిన వారిలో ప్రకాశ్‌గౌడ్, క్రిష్ణయ్య, వెంకటేశ్, సత్యకుమార్, రేణుకాస్వామి, రవికుమార్, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

పేదల సంక్షేమానికి కేసీఆర్ కృషి

ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



గొర్రెల యూనిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్: సీఎం కేసీఆర్ పేదల సంక్షేమానికి కృషి చేసి, వారిని ఆదుకుంటున్నారని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు 71, 5 షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ప్రజల అవసరాలను తీర్చేందుకు స్థలం ఉన్న వారికి ప్రభుత్వం రూ.3 లక్షలు ఇస్తుందన్నారు. గ్రామాల్లో కలిసి ఉండి అభివృద్ధి చేసుకోవాలన్నారు. మక్తల్ నియోజకవర్గ ప్రజల మేలును ఎప్పుడు మరువలేనని అన్నారు. మరిన్ని నిధులు తీసుకొచ్చి పనులు చేస్తానని అన్నారు. కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలే ప్రజల స్పందనకు నిదర్శనమన్నారు. పార్టీలను పక్కన పెట్టి పనులు చేయించి పంపిస్తానని అన్నారు.డిప్యూటీ తహసీల్దార్ లత, ఏఆర్ఐలు పోలీస్ భూపాల్‌రెడ్డి, విజయకుమార్, మహిపాల్‌రెడ్డి, ఎల్లారెడ్డి, కౌన్సిలర్ కౌసల్య, శ్రీనివాస్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ..

మక్తల్ మండలం పంచలింగాలకి చెందిన ఇల్లు కట్టుకోవడానికి ఇంటి స్థలం లేని వారికి 75 మంది నిరుపేదలకు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. సర్పంచ్ తిక్కమ్మ, గురనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గొల్ల, కురుమల జీవితాల్లో వెలుగులు

మాగనూర్: గొల్ల, కురుమల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీ పథకం సత్ఫలితాలిస్తుందని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండలంలోని కొల్పూర్‌కి చెందిన 12 మంది లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారు. అదే విధంగా గ్రామంలోని లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పెన్షన్ ప్రొసిడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాలు గొల్ల, కురుమలను పట్టించుకోలేదన్నారు. కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారని విమర్శించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా గొర్రెలు పంపిణీ చేసి వారికి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జయప్రద, జెడ్పీటీసీ వెంకటయ్య, ఎంపీటీసీ శ్యామలదేవి, ఎల్లారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నర్సింహులు, ఈశ్వర్‌యాదవ్, అశోక్‌గౌడ్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

పట్టాలు ఇవ్వాలని వామపక్షాల నిరసన



ధర్నాలో మాట్లాడుతున్న ప్రజాపంథా జిల్లా కార్యదర్శి రాము

మద్దూరు: ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములు సాగు చేసే వారిపై అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి వారికే భూ పట్టాలను ఇవ్వాలని సీపీఐఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి రాము, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం మద్దూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజా, దళిత, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పెదిరిపాడ్, దామరగిద్ద మండలంలోని అయ్యవారిపల్లి గ్రామాల రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 60 ఏళ్లుగా పెదిరిపాడ్, అయ్యవారిపల్లి గ్రామాలకు చెందిన రైతులు తమ భూములను సాగు చేసుకుంటున్నారని అన్నారు. పెదిరిపాడ్‌కు చెదిన భూస్వామి రఘోత్తమరావ్, ఆయన కుటుంబ సభ్యులు పేరుమీదనే ఇప్పటికీ ఈ భూముల పట్టాలు ఉన్నాయన్నారు. దీంతో సాగు చేసుకుంటున్న రైతులను తీవ్రంగా వేధిస్తున్నారని అన్నారు. అప్పట్లో వీరి నుంచి సాదాబైనామాతో కొనుగోలు చేసినా.. పట్టా చేయడానికి రైతుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తూ.. బెదిరించి భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండు గ్రామాల్లో దాదాపు 200 మంది రైతులకు భూమి సాగు చేస్తున్నా.. పట్టాలు లేకుండా పోయిందన్నారు. వెంటనే అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పేద రైతులకు భూమిపై హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ జయరాములుకు అందజేశారు. ప్రజా, దళిత, వాపక్ష నాయకులు అశోక్, శ్రీనివాస్, హన్మంతు, కాశీనాథ్, యాదగిరి, ప్రశాంత్, తాయప్ప, కొండా నర్సింహులు, అంజి, నర్సింహ పాల్గొన్నారు.

చిన్నపొర్లకు బస్సు సౌకర్యం కల్పించాలి

ఊట్కూరు: చిన్నపొర్లకి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ సోమవారం నారాయణపేట డిపోలో ఈసీ అలివేలుకు ఎంపీటీసీ రవిప్రసాద్‌రెడ్డి వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాలుగేళ్ల కిందట గ్రామానికి బస్సు సౌకర్యం ఉండేదని, రోడ్డు బాగా లేదని అధికారులు బస్సు నిలిపివేశారని తెలిపారు. ఆరు నెలల కిందట గ్రామానికి నూతనంగా బీటీ రోడ్డు వేశారని, ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకుని గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. వినతి అందించిన వారిలో గ్రామస్తులు షకీల్, రాజు ఉన్నారు.

7న ఉట్టికొట్టే కార్యక్రమం

నారాయణపేట: చౌక్‌బజార్ మిత్రమండలి ఆధ్వర్యంలో వచ్చే నెల 7న సాయంత్రం 4 గంటలకు చౌక్ బజార్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు మిత్ర మండలి కన్వీనర్ హరినారాయణభట్టడ్ పేర్కొన్నారు. సోమవారం మిత్ర మండలి ఆధ్వర్యంలో రూపొందించిన ఉత్సవ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 7న ఉదయం 10 గంటలకు పూజ కార్యక్రమం, సాయంత్రం 4 గంటలకు ఉట్టి కొట్టే కార్యక్రమం ఉంటుందన్నారు. పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు నృత్యాలు చేసేందుకు వేషధారణలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మిత్ర మండలి సభ్యులు ఆనంద్‌ఘట్, ప్రకాశ్ బట్టడ్, ఆనంద్‌పసారీ, సిద్ధి వెంకట్రాములు, నికేతన్ శివకుమార్, వద్దినారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుండుమాల్ నారాయణకు సన్మానం

కోస్గి: బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన గుండుమాల్ నారాయణను సోమవారం ఆ పార్టీ రాష్ట్ర నా యకులు శాలువా, పూలమాలలతో సన్మానించి అభినందించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర నాయకులు నా గురావు నామాజీ, కొడంగల్ నాయకులు పున్నంచంద్ లాహోటి, న్యాయవాది బస్వరాజ్‌తో పాటు పలువు రు నారాయణ స్వగృహానికి చేరుకుని సన్మానించారు. మండల అధ్యక్షుడిగా పనిచేసిన నారాయణ పార్టీలో సీనియర్ నాయకులుగా మంచి గుర్తింపు పొందారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర స్థాయి పదవి ఇచ్చిన పార్టీ అధిష్టానానికి నారాయణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీని మరింత అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

బాలికలకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న వర్కటం

ఊట్కూర్: మండలంలోని చిన్నపొర్ల ఉన్నత పాఠశాలలో సోమవారం బీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 17 మంది బాలికలకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి మాట్లాడారు. విద్యాభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని అన్నారు. నియోజకవర్గంలోని పలు పాఠశాలలో బాలికలకు సైకిళ్లను పంపిణీ చేస్తున్నానని అన్నారు. సర్పంచ్ రవీందర్ రెడ్డి, ఎడవెల్లి సర్పంచ్ శిరీష, నర్సింహ, మహిబూబ్, అబ్దుల్ రజాక్, తాయప్ప, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

కృష్ణా: రాష్ట్ర ప్రభుత్వం పాలనలో విఫలమైందని ఆరోపిస్తూ.. సోమవారం తహసీల్దార్ దయాకర్‌రెడ్డికి టీడీపీ మండల నాయకులు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు తిమ్మప్ప మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో అధికార పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని ఆరోపించారు. నాయకులు రామకృష్ణా, హన్మంతు ఉన్నారు.

గర్భిణులతో డబ్బులు వసూలు



మక్తల్‌లో ప్రభుత్వ ఆస్పత్రి

- ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల అవస్థలు
- వైద్యసిబ్బంది నిర్లక్ష్యం
- మందులు, రక్త పరీక్షలు బయటే..

మక్తల్: ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పులు చేసుకోవాలని అధికారులు చెబుతన్నా.. ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే మాత్రం ప్రాణం పిండుకుతింటున్నారు నర్సులు. కాన్పునకు వచ్చే గర్భిణిని నర్సులు సరిగా పట్టించుకోవడంలేదు. నాకు కాన్పు చేయమ్మ.. అంటూ గర్భిణులు వేడుకుంటున్నా.. ఇప్పుడు కాదు కాన్పు.. రాత్రికి అయితది అమ్మ.. అంటూ సమాధానం చెప్పుకొంటూ బయటకు వెళ్తున్నారు. డబ్బులు ఇచ్చిన వారినే పట్టించుకుంటున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రిలో తాగునీరు కరువైంది. చికిత్స కోసం వచ్చే మహిళలు, బాలింతలు, రోగులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రిలో నలుగురు డాక్టర్లకుగాను కేవలం ఇద్దరు మాత్రమే పనిచేస్తున్నారు. ప్రతి రోజూ 250 నుంచి 300 మంది వరకు రోగులు చికిత్సలు చేయించుకుంటున్నారు.
- 30 పడకల ఆస్పత్రి ఉన్నా.. రక్తనమూన పరీక్షలు చేయాలంటే బయటకు వెళ్లాల్సి వస్తోంది. కేవలం హెచ్ఐవీ పరీక్షలు మాత్రమే ఇక్కడ చేస్తామని చెబుతున్నారు. వసతులు లేకపోవడంతో వైద్యులు సైతం ఇక్కడ ఉండేందుకు వెనుకంజ వేస్తున్నారు.
- వైద్యులు మాత్రం తమ డ్యూటీ వరకే తాము బాధ్యత తీసుకొని పని ముగించుకుని వెళ్లిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు డబ్బులు తీసుకుంటున్న నర్సులపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

చికిత్స చేయడంలో నిర్లక్ష్యం..



ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సలు చేయడంపై వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పలకరించే నాథుడు కరువయ్యారు. చికిత్స చేసే సరికే రోగి కాటికి వెళ్తున్నాడు. అధికారులు వారిపై చర్యలు తీసుకోవాలి. తాగునీరు సరిగా ఉండటం లేదు. బాలింతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– సూర్యకుమార్, గొల్లపల్లి

ఆస్పత్రిలో మెరుగైన సేవలు అందించాలి..



ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలు చేయాలి. ఏదైన ప్రమాదం జరిగితే వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలి. ప్రతిఒక్కరూ డ్యూటీలో ఉండే వారు రోగులకు మందులు అందుబాటులో ఉంచాలి. గర్భిణులతో డబ్బులు తీసుకుంటున్నట్లు సమాచాం వస్తుంది. వారిపై ప్రత్యేకగా నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలి

– ప్రసన్నరెడ్డి, కౌన్సిలర్ 8వ వార్డు, మక్తల్ మున్సిపాలిటీ

చర్యలు తీసుకుంటాం..

గర్భిణులతో డబ్బులు వసూలు చేసినట్లు తమకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. తాగునీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. బోరు పని చేస్తున్నప్పటికీ, నీటిని వాడుకోడానికి ఆస్పత్రి పైన ట్యాంకులు ఏర్పాటు చేయలేదు. వాటి నిర్మాణం పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. చికిత్స చేసేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటాం.

– చక్రధర్‌గౌడ్, డాక్టర్, మక్తల్

విద్యార్థుల సామర్థ్యాల పెంపే లక్ష్యం



మాగనూర్ ప్రాథమిక పాఠశాలలో పరీక్షలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మాగనూర్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాల పెంపే లక్ష్యంగా జిల్లాలోని 50 ఎంపిక చేయబడిన పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ ఇన్వెస్టిగేషన్ టీంల ద్వారా మూడు రోజుల పాటు మూడో తరగతి విద్యార్థుల సామర్థ్యాల స్థాయి బోధన తెలుసుకునేందుకు పరీక్ష నిర్వహిస్తామని మాగనూర్ కాంప్లెక్స్ హెచ్ఎం నర్సింహులు తెలియజేశారు. ఇన్వెస్టిగేషన్ టెస్ట్‌లో భాగంగా మాగనూర్ మండలం నుంచి నాలుగు పాఠశాలలో సోమవారం టెస్ట్ నిర్వహించామని చెప్పారు. కలెక్టర్ ప్రత్యేక చొరవతో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారిలో సామర్థ్యాల పెంపునకు కృషిచేస్తున్నామని అన్నారు. మాగనూర్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శివరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడాకారులకు సన్మానం



ఉపేంద్రను సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

మాగనూర్: జాతీయ క్రీడల దినోత్సవం పురస్కరించుకుని నారాయణపేట జిల్లా సైకిలింగ్, షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. మాగనూర్ ప్రాథమిక పాఠశాల ఐదో తరగతి విద్యార్థి ఉపేంద్ర, అదే పాఠశాలకు చెందిన ఎస్జీటీ ఉపాధ్యాయురాలు దీపలను వారు ఘనంగా శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా షూటింగ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం మాట్లాడారు. ఉపేందర్ రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక కావడంలో ప్రోత్సహించిన పాఠశాల ఉపాధ్యాయురాలు దీప సేవలు చాలా గొప్పవని అన్నారు. వీరు రాష్ట్ర, జాతీయ స్థాయి లోనే కాకుండా అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని కోరారు.

బ్యాంకులపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ఎస్‌బీఐ బ్యాంకు అధికారులు

మాగనూర్: ప్రజలు బ్యాంకులపై అవగాహన కలిగి ఉండాలని కొల్పూర్ సర్పంచ్ జయప్రద అన్నారు. మండల పరిధిలో కొల్పూర్‌లో మక్తల్ ఎస్‌బీఐ బ్యాంకు వారి ఆధ్వర్యంలో సోమవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు బ్యాంకులపై అవగాహన కల్పించి, బ్యాంకుల ద్వారా ప్రజలకు కలిగే లాభాలను వివరించారు. దేశంలోని నిరుపేదలు కూడా బీమా సౌకర్యం పొందేలా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సురక్ష మిత్ర, జీవన జ్యోతి, అటల్ బీమా పెన్షన్ యోజన, రూపే కార్డులు వంటివి నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ బ్యాంకు అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎంపీడీఓగా బాధ్యతల స్వీకరణ



ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన యశోదమ్మ

కృష్ణా: మండల ఎంపీడీఓగా యశోదమ్మ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు మరికల్‌కు బదిలీపై వెళ్లారు. అదే విధంగా ఎంపీఓగా రామణ్ణ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, మండల ప్రజాప్రతినిధులు బాధ్యతలు చేపట్టిన అధికారులను శాలువాతో సన్మానించారు.

ఎంపీడీఓకు వీడుకోలు

ఊట్కూరు: ఊట్కూరు ఎంపీడీఓ కాలప్ప వీడ్కోలు సమావేశం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి మాట్లాడారు. మూడు సంవత్సరాలుగా ఎంపీడీఓగా విధులు సక్రమంగా నిర్వహించి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేశారని అన్నారు. బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓ కాలప్ప, ఎంపీఓ వెంకటేశ్వర్ రెడ్డిలను అధికారులు, ప్రజాప్రతినిధులు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు.

ఓటరు జాబితా తప్పులు లేకుండా తయారు చేయాలి



ఊట్కూర్‌లో బీఎల్ఓలతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

ఊట్కూర్: ఓటరు తుది జాబితాను తప్పులు లేకుండా తయారు చేయాలని అడిషనల్ కలెక్టర్ మియాంక్ మిట్టల్ అన్నారు. సోమవారం మండలంలోని ఊట్కూర్, పులిమామిడి తదితర గ్రామాల్లో బీఎల్ఓలు నిర్వహిస్తున్న ఓటరు జాబితా సర్వేను పరిశీలించారు. ఓటరు తుది జాబితాలో మార్పులు, చేర్పులపై అధికారులకు తగు సూచనలు చేశారు. రాష్ట్రంలో జరగబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు గాను ఓటరు లిస్టును సరిచేసుకోడానికి చివరి అవకాశం అని తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారికి కొత్త ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. ఓటరు జాబితాలో పేరు ఉందా అని పలువురు గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితా సవరణకు అధికారులు శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీఓ రమేశ్‌కుమార్, సూర్యప్రకాశ్‌రెడ్డి వెంకటేశ్, భీంరావు, వెంకటేశ్వరమ్మ, జయదేవి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ దుకాణ సముదాయానికి టెండర్లు పూర్తి



మక్తల్‌లో మార్కెట్ కార్యాయంలో టెండర్ల ప్రక్రియల్లో పాల్గొన్న అధికారులు

- 93 మంది దరఖాస్తుదారులు
- 26 దుకాణాల ఎంపిక పూర్తి

మక్తల్: పట్టణంలోని సంగంబండ రోడ్డు సైడ్ ఉన్న మార్కెట్ దుకాణ సముదాయానికి సోమవారం టెండర్ ప్రక్రియ పూర్తి చేశారు. మొత్తం 26 దుకాణాలకు 13 దుకాణాలు జనరల్ క్యాటగిరి, 7 బీసీలకు, 4 ఎస్సీలకు, 1 ఎస్టీలకు, 1 పీహెచ్‌సీలకు కేటాయించారు. టెండర్ ప్రక్రియలో పాల్గొన్న వారు డీడీ రూపంలో డబ్బులు చెల్లించారు. టెండర్‌లో 93 మంది పాల్గొనగా.. ఏడుగురు సకాలంలో డీడీలు ఇవ్వకపోవడంతో వాటిని రిజక్ట్ చేశారు. బీసీల క్యాటగిరిలో 50 మంది, జనరల్ క్యాటగిరిల్లో 27 మంది, ఎస్సీలు 10 మంది, ఎస్టీలకు 2, పీహెచ్‌సీలు 4 టెండర్లు వేశారు. టెండర్‌లో ఎక్కువగా రూ.22,850, తక్కువలో రూ.7,516 టెండర్ వేశారు. టెండర్‌లో 26 దుకాణాలను క్యాటగిరి ప్రకారం ఎంపిక చేశారు. ఆన్‌లైన్ టెండర్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో జేడీ ఇఫ్తాకర్ అహ్మద్, డీఎం బాలమణి, కార్యదర్శి చంద్రశేకర్, ఏఎంసీ రామకృష్ణ, గ్రేడర్ ధర్మవీర్ తదితరులు పాల్గొన్నారు.

కోటకొండపై వివక్ష వీడాలి

నారాయణపేట రూరల్: కోటకొండను మండలంగా ఏర్పాటు చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వివక్ష విడనాడాలని సాధన సమితి నాయకులు అన్నారు. గ్రామ చౌరస్తాలో నిర్వహిస్తున్న దీక్షలు సోమవారానికి 111వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సాధన సమితి నాయకులు మాట్లాడారు. ఇటీవల ఎన్నో కొత్త మండలాలను అందించిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఎర్రవల్లి మండలం ప్రకటించిందని, ప్రజల ఆకాంక్షలతో ఉద్యమం చేస్తున్న కోటకొండను పట్టించుకోకపోవడం విడ్డూరమని అన్నారు. ఎమ్మెల్యే చొరువ తీసుకుని నియోజకవర్గంలో కానుకుర్తి, గార్లపహాడ్‌లతో కలిపి కోటకొండను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

భవన నిర్మాణ కార్మికులందరికీ సైకిల్‌మోటార్లు ఇవ్వాలి



రాజ్‌కుమార్‌కు వినతి అందజేస్తున్న నాయకులు

నారాయణపేట: అంతర్జాతీయ కార్మిక దినోత్సవం 2022 మే 1న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో నమోదు చేసుకున్న కార్మికుల్లో అర్హులైన వారందరికి మోటారు సైకిళ్లని అందివ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు వెంకట్రామరెడ్డి, బాల్‌రామ్ మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. సంక్షేమ బోర్డు ద్వారా అందిస్తున్న ప్రసూతి సాయం రూ.30 వేల నుంచి రూ.లక్షకు పెంచాలని, సహజ మరణానికి రూ.1.30లక్షల నుంచి రూ.5 లక్షలకు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కార్మిక శాఖ అధికారి రాజ్‌కుమార్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతి అందజేశారు. బాల్‌రాం, జోసి, మన్యం, గోవిందు, వెంకటరాములు, ఒగ్గుబాలప్ప పాల్గొన్నారు.